# పరిమళించని పసిడి మొగ్గ

ఎల్. సుకన్య



**కృష్ణవేణి కుడి చేయి మౌస్‌ని కదిలిస్తూ వుంది. డెస్క్ టాప్ మీద గజిబిజిగా వుంది. ఆమె అవేవీ పట్టించుకోవడం లేదు. స్క్రీన్‌ని చూడ్డం లేదు. మౌస్‌ని అటు ఇటూ నొక్కుతూ గడ్డం కింద చేయి పెట్టుకొని అలా కిందకి నేల చూపులు చూస్తోంది.**

కృష్ణవేణి అంతరంగంలో అవ్యక్తమైన అలజడి. బాధాకరమైన సంఘటన ఏదో జరిగినట్లు మనసుని తొలుస్తున్న బాధ. పనిలో నిమగ్నం కాలేకపోతోంది. అసలు ఆరోజు ఆఫీసుకి రాబుద్ధి కాలేదు. కానీ తప్పదు. శెలవులు ప్రాబ్లం. అసలు ప్రతి రోజూ ఆఫీసుకు బలవంతంగా రావడమే. పెళ్లికి ముందు, తర్వాత కూడా వున్నంతలో మంచి చీరలు కట్టుకొని నీట్‌గా వుత్సాహంగా ఆఫీసుకు వచ్చేది. మరింత ఉత్సాహంగా అటు ఇటూ అందరితో మాట్లాడుతూ సరదాగా తిరిగేది. కానీ ఇద్దరు పిల్లలు వెంట వెంటనే పుట్టాక వుత్సాహమంతా తుంగలో తొక్కినట్లయింది. పిల్లల ఆలనా పాలనా చూసి, స్కూలుకు పంపి అంట్లుతోముకుని, బట్టలు వుతుక్కుని అన్నీ సర్దుకుని తాళాలు వేసుకొని బయటపడాలంటే ఒక మహాయజ్ఞం చేసినట్లుగా వుంది. అలసటగా అనిపిస్తోంది. తినడానికి టైంలేక చిన్న బాక్స్‌లో భోజనం సర్దుకొని బస్ కోసం పరుగెత్తాలంటే ఎంతో భారంగా వుంది. కాళ్లు ముందుకు గబగబా సాగడం లేదు. అందులోనూ పిల్లలకి శెలవులిచ్చినప్పుడు వాళ్లని వదిలిరావాలంటే మరింత కష్టంగా వుంది. హాయిగా పిల్లలకి కబుర్లు చెపుతూ, వాళ్ల కమ్మని మాటలు వింటూ, వాళ్లకి కావల్సినవి వండి పెడుతూ ఎంత ఆనందంగా గడపొచ్చు? వెధవ వుద్యోగం..చచ్చేటంత చాకిరీ. ఈ కంప్యూటర్ ముందు కూచుని కూచుని కళ్లు, కాళ్లు నొప్పి, నడుం పీకడం ఏం చేస్తాం...ఖర్మ...భగవంతుడు మమ్మల్ని మధ్య తరగతి వూబిలోకి ఇలా బ్రతకమని కుమ్మేశాడు.

పిల్లలు ఏం చేస్తున్నారో?

పెద్దమ్మాయి శ్రావణికి ఆరు సంవత్సరాలు.

చిన్నమ్మాయి శ్రావ్యకి ఐదు సంవత్సరాలు.

ఇద్దరికీ ఇద్దరూ...పొద్దున్నే నిద్ర లేవరు. పాలు తాగరు...స్కూలుకు టైం అవుతుందన్న ధ్యాస వుండదు. అల్లరి, ఆటలు ఎక్కువ. శెలవులు వస్తే మరీ ఇబ్బంది. లేవనే లేవరు. తనకేమో ఆఫీసు టైం అవుతూ వుంటుంది. ఆయనగారేమో మగమహారాజులా మసలుతారు. వుదయం ఎనిమిది గంటలకు ఆఫీసుకు బయలుదేరితే తిరిగి ఇల్లు చేరేది రాత్రి ఎనిమిది తర్వాతే. ఇంటి బాధ్యతల్ని అంతగా పట్టించుకోరు. ఇంట్లో వున్న కాసేపూ టీవి చూస్తూ రిలాక్స్ అవడానికే ప్రయత్నిస్తారు. ఏం చెయ్యరు? కొంచెం సాయం చేస్తే ఎంత బాగుండును?

పిల్లల్ని చూస్తుంటే ఒక్కోసారి జాలేస్తూంటుంది. సాయంత్రం తను ఇల్లు చేరేవరకూ వాళ్లు అక్కడా ఇక్కడా ఆడుకుంటూ గడపడం, తను వంట చేస్తూ, హోంవర్క్ చేయమంటూ వేధించడం, వాళ్లు వాళ్ల నాన్నతో బాటు అన్నం తినీతినక నిద్రలోకి ఒరిగిపోవడం. పిల్లల్తో ఆప్యాయంగా మాట్లాడి, లాలించే సందర్భాలు రోజురోజుకి కరవవుతున్నాయి. పిల్లలకి శెలవులిస్తే వాళ్లు నిద్ర లేచే సమయానికి తను హడావుడిగా ఆఫీసుకు పరుగులు పెట్టడం, టేబుల్ మీద అన్నం కూరలు పెట్టి తినమని చెప్పి వాళ్లని లోపల బంధిఖానాలో వుంచినట్టు వుంచి బయట తలుపుకు తాళం వేసుకొని బయలుదేరటం.

తలచుకుంటూంటే ఎంతో అసంతృప్తిగా వుంది. ఎన్నో విలువైనవి కోల్పోతున్నట్లుగా వుంది.

ఉద్యోగం మానేద్దామన్పిస్తూ వుంటుంది ఒక్కోసారి. కానీ తప్పదు. ఇద్దరు పిల్లలు. వాళ్ల చదువులతో పాటు ఆర్థిక సమస్యలు, బరువు బాధ్యతలు పెరుగు

తుంటే ఇద్దరం వుద్యోగాలు చెయ్యకపోతే ఎలా? కూడు సంగతి ఎలా వున్నా ముందు గూడుకు అద్దె చెల్లించాలిగదా?

ఏమిటో ఈ రోజు మరీ దిగులుగా వుంది. త్వరగా ఇంటికి వెళ్లాలన్పిస్తోంది. తను ఆఫీసుకు బయలుదేరే ముందు లేపగా...లేపగా అప్పుడే నిద్ర లేచారు. పాలు కలిపి టేబుల్ మీద పెట్టి తాగమని హ్యాండ్ బ్యాగ్ భుజాన వేసుకొని బయటకు వచ్చింది.

ఇంటికి తాళం వేస్తుంటే శ్రావ్య కిటికీ లోంచి చూస్తూ 'అమ్మా, ఈ రోజు తాళం వెయ్యకే...మేం అస్సలు బయటకు వెళ్లం.... ఎవ్వర్నీ లోపలకు రానియ్యం... ఇంట్లోనే ఆడుకుంటాం'' అంది.

తాళం చేతులు బ్యాగులో వేసుకుంటూ ''అల్లరి చేయకుండా ఆడుకోండి. నేను త్వరగా వచ్చేస్తా'' అని కిటికీ దగ్గరకు వస్తూ

''ఎప్పుడూ అలాగే అంటావు. కాని రావు. అన్నీ అబద్ధాలే చెపుతావు''

''లేదు లేదు ఈరోజు తప్పకుండా త్వరగా వస్తా. కొట్టుకోకండి''

అంతలో శ్రావణి, శ్రావ్య వెనక నిలబడి అంది '' అమ్మా...అమ్మా...మేం ఈరోజు అన్నాల ఆట ఆడుకుంటాం. మేం వండిన అన్నం, పప్పు నువ్వూ, నాన్న తినాలి''

''మేం వండినవి మీరు తింటేనే నువ్వు వండిన అన్నం మేం తింటాం'' అంది శ్రావ్య

''అలాగే...కొట్టుకోకుండా ఆడుకోవాలి''

''అన్నం పప్పు వండుతామమ్మా'' శ్రావణి చెప్పింది మళ్లీ.

''సరే...సరే...'' కృష్ణవేణి వాచీ చూసుకుంటూ అన్నది.

''మరి కందిపప్పు డబ్బాలో నుంచి తీసుకుంటాం''

''నాన్నా, నువ్వు తప్పకుండా తినాలి''

''సరే...టాటా...బై'' గేటు వైపు గబగబా నడుస్తూ చెప్పింది.

''తినకపోతే వూరుకోం'' శ్రావ్య గట్టిగా అరిచింది.

''అమ్మా..అమ్మ ఒక్క ముద్దిచ్చి వెళ్లవా? ప్లీజ్'' వెనుక నుంచి శ్రావణి స్వరం వినిపిస్తుంటే ''సాయత్రం...సాయంత్రం'' అంటూ ముందుకు పరుగు లాంటి నడక సాగించింది కృష్ణవేణి. అబ్బా...అప్పుడే ఎండ చుర్రు మంటోంది అనుకుంటూ..

''పిల్లలు ఏం చేస్తున్నారో?'' సీట్లో అసహనంగా కదిలింది.

ఎండాకాలం శెలవులొస్తే అక్కడ పోర్షన్లలో వాళ్లు వూరికి వెడుతుంటారు. దగ్గరే కాబట్టి అంత ఖర్చు వుండదు వాళ్లకి. కానీ తనకు అలా కాదు. ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా. బోలెడంత డబ్బు ఖర్చు. శెలవులంటే స్కూళ్లకి డబుల్ ఫీజు కట్టాలి. వూరెళ్లాలంటే పిల్లలకి బట్టలు కొనాలి. అదే వూళ్లో వుంటే రెండు జతల పాత ఫ్రాకులతో, పాత యూనిఫాంతో నడిచిపోతుంది. వూరెళ్లినప్పుడు పిల్లలు పాత ఫ్రాకులు వేసుకుంటే అమ్మ ఏమనుకుంటుంది? ఇరుగు పొరుగు ఏమనుకుంటారు? తల్లీతండ్రీ ఇద్దరూ వుద్యోగాలుచేస్తున్నారు. హైదరాబాద్లో వుంటున్నారు. పిల్లలకి సరైన బట్టలు కూడా కుట్టించలేదని అనుకోరూ? ఇక్కడి పరిస్థితి వాళ్లకేం తెలుసు? ఇంటి అద్దెకి, స్కూల్ ఫీజులకి, బియ్యం కొనడానికే తన జీతం సరిపోతుంది. ఆయన జీతం ఏమవుతుందో ఆయనకే తెలియాలి. ఏదడిగినా విసుక్కుంటారు. ప్రతి ఆదివారం సాయంత్రం రైతు బజారుకు వెళ్లి నాలుగు రకాల కూరగాయలు తీసుకొచ్చి పడేస్తారు. నెలకోసారి వెచ్చాలు తీసుకువస్తారు. వాటితోనే సర్దుకోవాలి. మధ్యలో ఏమవసరం వచ్చినా తను చూసుకోవాల్సిందే. టీవీ కేబుల్ కనెక్షన్కి మాత్రం డబ్బులు కడతారు. ఏది కట్టినా కట్టకపోయినా. ఆఫీసులో చిన్న చిట్టీ ఏదో వున్నట్టుంది. ఏమీ చెప్పరు.

పిల్లల్ని అమ్మ దగ్గరకు పంపాలనే వుంది. తీసుకు వెళ్లి వదిలి రావాలి. నాలుగురోజులు శెలవు పెట్టాలి. అంతకు మించి శెలవు పెట్టడానికి కుదరదు. పిల్లలకి వంట్లో బాగాలేకపోయినా, ఆయనకి ఏదైనా ఇబ్బంది వచ్చినా, బంధువులు ఎవరొచ్చినా తను శెలవు పెట్టాల్సిందే. అందుకే తల నొప్పి వచ్చినా, జ్వరం వచ్చినా, వంట్లో ఎలా వున్నా ముక్కుతూ మూలుగుతూ తను ఆఫీసుకు వస్తుంది. పర్సులో పదిరూపాయలు ఖర్చు కాకుండా ఎంత జాగ్రత్తగా వుంటుందో...అంతకంటే జాగ్రత్తగా శెలవుల్ని వాడుకుంటుంది. జీత నష్టాన్ని భరించే స్థితిలో లేదు మరి.

పిల్లల్ని అమ్మ దగ్గర వుంచితే తనకెంత హాయి? ఎంత నిశ్చింత? వాళ్లకి కూడా ఎంతో హాయిగా వుంటుంది. అమ్మ వున్నంతలో ఎంతో చక్కగా, ప్రేమగా చూసుకుంటుంది. అమ్మ ఖర్చుల్ని భరించే స్థితిలో లేకపోయినా తీసుకొచ్చి దిగబెడుతుంది కూడా. పాపం ఒంటరి జీవితం. తమ్ముడు, మరదలు వచ్చాక అమ్మ గురించి పట్టించుకోవడం ఎప్పుడో మానేశాడు. ఇక్కడికి వచ్చి వుండమంటే వుండదు. అల్లుడి ఇంట్లో వుండడం మర్యాదగా వుండదని, ఎప్పుడొచ్చినా రెండు రోజుల కంటే ఎక్కువ వుండదు. అమ్మ ఏం చేస్తోందో? వేసవి కాలం శెలవులకి పిల్లలకి పరీక్షలు అయిన వెంటనే తీసుకువచ్చి దిగబెట్టి వెళ్లు. నాకు అంత ఆరోగ్యం బావుండడంలేదని ఇప్పటికే రెండు సార్లు ఫోన్ చేసింది. పిల్లల్ని తీసుకుని వెళ్లి రావాలి. ఎలాగైనా.. సరెండర్ లీవుకు అప్లయ్ చేసి చాలారోజులైంది. ఆ డబ్బులు వస్తే వెళ్లి రావచ్చు.

పిల్లల్ని ఇంట్లో వుంచి తాళం వేసి రావడం అంటే వాళ్లని జైల్లో వుంచినట్లే గదా! వున్నవే రెండు రూములు. ఏం చేస్తున్నారో? కొట్టుకుంటున్నారో ఏమో? అన్నం తిన్నారో లేదో? టేబుల్ మీద అన్నీ పెట్టే వచ్చింది. పప్పు చారు, దొండకాయ కూర. పెద్దదానికి పప్పుచారు ఇష్టం. చిన్నదానికి దొండకాయ కూర ఇష్టం. వేయించిన మరమరాలు, పల్లీలు కూడా టేబుల్ మీదే పెట్టింది. ఆడుకుంటున్నంత సేపూ బాగానే ఆడుకుంటారు. పోట్లాట మొదలైతే మాత్రం రణరంగమే. జుట్లు,ఫ్రాకులు పీక్కుంటారు. చిన్నది మహా రాక్షసి. ఏది చేతి కందితే అది విసిరికొడుతుంది. ఇంతకు ముందు ఒకసారి బెండకాయ పులుసు మొత్తం శ్రావణి నెత్తి మీద పోసింది. ఇప్పుడు పప్పు చారు గిన్నె మొత్తం టేబుల్ మీద పెట్టి వచ్చింది. చిన్న గిన్నెలో పోసి పెడదామనుకుంది. కానీ కుదరనే లేదు. దొర్లించరు కదా? పాపం పెద్దది మెతక. దాని జడలో ఒక్క పువ్వు వుండనివ్వదు. ఒక్క పక్కపిన్ను వుండనివ్వదు. పెద్దదానికి చిన్నదాన్ని ఎదుర్కోవడమే చేతకాదు. ఏడ్వడం మాత్రం బాగా తెలుసు. మొద్దు మొఖం. ఎప్పుడు నేర్చుకుంటుందో ఏమో? పొద్దున ముద్దు అడిగింది. ఇచ్చి వుంటే ఎంత బావుండేదీ?

రోజులు అసలే బావోలేవు. చిన్నా, పెద్దా వయో బేధం లేకుండా అరాచకాలుజరుగుతున్నాయి. పసి మొగ్గల్ని సైతం కామాంధులు నలిపేస్తున్నారు. తలు చుకుంటేనే భయం వేస్తోంది. అందుకేగా పిల్లల్ని లోపల వుంచి తాళాలు వేసి రావడం. అయినా ఈ రోజుల్లో తాళాల వల్ల భద్రత అంతంత మాత్రమే. ఒక్క పిడి గుద్దుతో వూడి వస్తున్నాయి. నా పిల్లలకి ఏదో ఆపద జరుగుతున్నట్లుగా అనిపిస్తోంది. ఏ పోకిరీ వెధవైనా పిల్లలు ఒంటరిగా వున్నారని కనిపెట్టి తాళాలు పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించలేదుగదా! నా పిల్లలకి ఏమీ జరుగలేదు కదా!

కృష్ణవేణి భయంతో వణికిపోయింది. సీట్లో అసహనంగా కదిలింది. 'భగవాన్ నా పిల్లలకి ఎటువంటి అపకారం జరగకుండా చూడు స్వామీ! నీకు శతకోటి దండాలు స్వామీ' ఖర్చు ఎంత అయినా సరే, అప్పు తర్వాత తీర్చుకోవచ్చు. త్వరగా పిల్లలిద్దర్ని అమ్మ దగ్గర వదిలిరావాలి. త్వరగా ఎన్ క్యాష్మెంటు డబ్బులు వస్తే బావుండును. వెంటనే ఆదివారం కల్సి వచ్చేలా చూసుకొని పిల్లల్ని తీసుకువెడతాను. డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలిస్తే ఈవారమే బయలుదేరవచ్చు. కృష్ణవేణి సీట్లో నుంచి లేచింది. ఒపి సెక్షన్కి వెళ్లింది. బిల్లు పాసయింది. రేపో, మాపో డబ్బులు వస్తాయని చెప్పారు. ఆనందపడింది కృష్ణవేణి. అయినా మనసు ఎందుకో భారంగా వుంది. ఏమిటో అనీజీగా వుంది.

కృష్ణవేణి భయంతో వణికి పోయింది. సీట్లో అసహనంగా కదిలింది. 'భగవాన్ నా పిల్లలకి ఎటువంటి అపకారం జరగకుండా చూడు స్వామీ! నీకు శతకోటి దండాలు స్వామీ' ఖర్చు ఎంత అయినా సరే, అప్పు తర్వాత తీర్చుకోవచ్చు.

తిరిగి వచ్చి సీట్లో కూర్చోబోతుంటే, ఆ హాల్లో చివరనున్న సెక్షన్ నుండి అరిచారు. 'ఏమండీ కృష్ణవేణి గారూ, మీ ఇంటి నుంచి ఫోన్'

''ఇంటి నుండి ఫోనా? ఎవరు? మా వారా?'' అంది అటు నడుస్తూ.

''కాదు..కాత్యాయిని గారట''

ఫోన్ అందుకోగానే...కాత్యాయని అంది. ''కృష్ణవేణి గారూ మీరు అర్జంటుగా ఇంటికి రావాలి. ఆలస్యం చేయకండి'' ఆ స్వరంలో తొందరపాటు.

కృష్ణవేణి షాక్ తగిలినట్లు అయింది. అప్రయత్నంగానే అడిగింది. ''ఏం జరిగింది''

''మీ పెద్దమ్మాయి శ్రావణికి వళ్లు కాలింది. మీ వారికి కూడా ఫోన్ చేశాం. వస్తున్నారు.''

'ఎలా?' మనసు మొద్దుబారినట్లు అయింది. అయోమయంగా వుంది. రిసీవర్ జారిపోయిందో, క్రెడిల్ మీద పెట్టిందో తెలియదు.

ఇంటికి ఎలా చేరిందో అసలే తెలియదు. గాబరాగా వుంది.

ఇంటి ముందు పల్చగా జనం. ఏదో అశుభపు ఛాయలు.

'నా శ్రావణికి ఏమైయింది?' వంట్లో రక్తపుచుక్కలే నట్లుగా వుంది.

